క్లుప్తంగా

ప్రయాణికుల నిరసన

ఆదిలాబాద్: బస్సు సమయానికి రాకపోవడంతో జైనథ్ మండలం కూర–కరంజి గ్రామానికి చెందిన ప్రయాణికులు బుధవారం నిరసన వ్యక్తం చేశారు. ఆదిలాబాద్ బస్టాండ్ వద్ద బైఠాయించి బస్సులను అడ్డుకున్నారు. గతంలో రెండు సర్వీసులు నడిపే వారని, ప్రస్తుతం ఒకటే సర్వీసును నడపడం వల్ల ఇబ్బంది పడుతున్నామని వాపోయారు. అనంతరం ఆర్టీసీ అధికారులు బస్సును ఏర్పాటు చేయడంతో ఆందోళన విరమించారు.

20న వాల్‌పెయింటింగ్ పోటీలు

కైలాస్‌నగర్: ఆదిలాబాద్ మున్సిపల్ ఆధ్వర్యంలో ఈనెల 20న కలెక్టర్ క్యాంపు కార్యాలయం, దాని పక్కనున్న ఇతర కార్యాలయాల గోడలపై చిత్ర లేఖన (వాల్ పెయిటింగ్) పోటీలు నిర్వహిస్తున్నట్లు కమిషనర్ శైలజ ఒక ప్రకటనలో తెలిపారు. పెయింటర్ అసోసియేషన్, హైస్కూల్, ఇంటర్, డిగ్రీ, ఆర్ట్స్ కళాశాల, రిమ్స్ కళాశాల విద్యార్థులు ఈపోటీల్లో పాల్గొనవచ్చన్నారు.

నేటి నుంచి మళ్లీ పుర ప్రజావాణి

కైలాస్‌నగర్: ఆదిలాబాద్ మున్సిపల్ పరిధిలోని ప్రజల సమస్యలను పరిష్కరించాలనే ఉద్దేశంతో చేపట్టిన పుర ప్రజావాణి ఇక నుంచి ప్రజల చెంతనే నిర్వహించాలని మున్సిపల్ అధికారులు నిర్ణయించారు. ప్రతీ మంగళవారం మున్సిపల్ కౌన్సిల్ సమావేశ మందిరంలో నిర్వహించగా అనివార్య కారణాల వల్ల రద్దు చేశారు.బాధితుల నుంచి అర్జీలు స్వీకరించేలా కార్యక్రమానికి శ్రీకారం చుట్టనున్నట్లు కమిషనర్ శైలజ తెలిపారు.

కుట్టు శిక్షణ సద్వినియోగం చేసుకోవాలి

ఇంద్రవెల్లి: హెల్పవీల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచితంగా అందిస్తున్న కుట్టు మిషన్ శిక్షణను యువతులు, మహిళలు సద్వినియోగం చేసుకోవాలని ఫౌండేషన్ సభ్యుడు కాంబ్లే అతీష్‌కుమార్ కోరారు. బుధవారం మండలంలోని ముత్యంపేట్‌లో ఉచిత కుట్టు శిక్షణ కేంద్రాన్ని ప్రారంభించారు. మహిళలు అన్ని రంగాల్లో రాణించాలన్నారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ భీంరావ్, హెల్పవీల్ ఫౌండేషన్ సభ్యుడు భాస్కర్, బాబా, సంతోష్, గణేష్ పాల్గొన్నారు.

టీటీసీ తరగతులు..

ఆదిలాబాద్‌టౌన్: టీటీసీ ఉచిత శిక్షణ తరగతులను అభ్యర్థులు సద్వినియోగం చేసుకోవాలని ఏబీవీపీ కన్వీనర్ అవునూరి కార్తీక్ అన్నారు. జిల్లా కేంద్రంలోని వినాయక్‌చౌక్ శిశుమందిర్‌లో ఏబీవీపీ ఆధ్వర్యంలో శిక్షణ తరగతులకు హాజరైన పుస్తకాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు ఉదయ్, మహేశ్, అఖిలేష్, నిఖిల్, తదితరులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన ఉండాలి

ఆదిలాబాద్‌రూరల్: ఆడ పిల్లలు, మహిళల రక్షణ కోసం అనేక చట్టాలు ఉన్నాయని, వాటిపై ప్రతిఒక్కరికీ అవగాహన కలిగి ఉండాలని షీటీం ఇన్‌చార్జి, ఏఎస్సై సునీత అన్నారు. బుధవారం మావల మండల కేంద్రంలో మహిళ చట్టాలపై అవగాహన కల్పించాలన్నారు. ఎవరైనా ఆకతాయిలు ఇబ్బందులకు గురి చేస్తే డయల్ 100కు సమాచారం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో షీ టీం సిబ్బంది పాల్గొన్నారు.

'రాజకీయ లబ్ధి కోసమే అధికారులపై ఒత్తిడి'

ఆదిలాబాద్‌టౌన్: బీజేపీ నాయకుడు గంద్రత్ మహేందర్ రాజకీయ లబ్ధికోసమే మున్సిపల్ కార్యాలయంలో అధికారులు, సిబ్బందిపై ఒత్తిడికి గురిచేస్తున్నాడని మున్సిపల్ వైస్ చైర్మన్ జహీర్ రంజాని ఆరోపించారు. బుధవారం జిల్లా కేంద్రంలో మాట్లాడారు. ఇటీవల వైరల్ అయిన వీడియోలో ఎవరి మనోభావాలను దెబ్బతీసే విధంగా వ్యవహరించలేదన్నారు. సమావేశంలో కౌన్సిలర్లు వెంకన్న, ప్రణయ్, బీఆర్ఎస్ నాయకులు గణేశ్, ధమ్మపాల్, మోబిన్, సంజయ్, అతీఖ్, ఆసిఫ్ పాల్గొన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం

ఆదిలాబాద్‌రూరల్: క్రీడలతో మానసికోల్లాసం కలుగుతుందని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ప్రియదర్శిని స్టేడియంలో నిర్వహిస్తున్న ఆదిలాబాద్ రూరల్ మండలస్థాయి క్రీడ పోటీలు బుధవారంతో ముగిశాయి. గెలుపొందిన వారికి ప్రశంసా పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ గంద్రత్ రమేశ్, డీవైఎస్‌వో వెంకటేశ్వర్లు, ఎంపీడీవో లక్ష్మీకాంత్‌రావ్, ఎంపీవో ఆనంద్, తదితరులు పాల్గొన్నారు.

బదిలీలు, పదోన్నతులపై చొరవ చూపాలి

ఆదిలాబాద్‌టౌన్: రాష్ట్ర ప్రభుత్వం బదిలీ, పదోన్నతుల విషయంలో చొరవ చూపాలని టీయూపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి వలబోజు గోపికృష్ణ డిమాండ్ చేశారు. బుధవారం జిల్లా కేంద్రంలో మాట్లాడారు. వేసవి సెలవుల్లో బదిలీ, పదోన్నతి ప్రక్రియను చేపట్టాలని కోరారు. విద్యా సంవత్సరం ప్రారంభం కాగానే.. పాఠ్య పుస్తకాలు అందజేయాలన్నారు. మనోజ్ రెడ్డి, యాదవ్ రావు, గోపాలకృష్ణ, వెంకట్ రాంరెడ్డి, రాజ్‌కుమార్, రాజశేఖర్ పాల్గొన్నారు.

శిథిలావస్థలో వంతెనలు

- ఇప్పటికే కూలిన కంద్ర వాగు బ్రిడ్జి
- వర్షంపడితే 20 గ్రామాలకు రాకపోకలు బంద్
- ప్రమాదకరంగా నక్కలవాడ, ధన్నూర్ వంతెనలు



కూలిన కంద్రవాగు వంతెన

బోథ్: బోథ్ మండల కేంద్రానికి ఆనుకుని ఉన్న కంద్ర వాగు లోలెవల్ వంతెన ఇటీవల ఒకవైపు కూలిపోయింది. దీంతో వంతెనపై రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. పూర్తిగా కూలడానికి సిద్ధంగా ఉండడంతో అధికారులు వంతెనపై నుంచి రాకపోకలు నిలిపివేశారు. ప్రస్తుతం తాత్కాలికంగా వాగుపై నుంచి మొరంతో దారి నిర్మించారు. వర్షాకాలంలో వరద ఉధృతికి రోడ్డు కొట్టుకుపోయే అవకాశం ఉంది. ఇదే జరిగితే కరత్వాడ, పట్నాపూర్, మర్లపెల్లి, కంటెగాం, నిగినితో పాటు మరో 15 గ్రామాలకు మండల కేంద్రం నుంచి రాకపోకలు పూర్తిగా నిలిచిపోతాయి.

వంతెన నిర్మాణంలో ఆలస్యం..

గత రెండేళ్ల క్రితమే వంతెనను నిర్మించాలని ఇక్కడి ప్రజలు కోరుతున్నారు. వంతెన కుడి వైపున కూలడంతో కొన్ని రోజులు రాకపోకలు నిలిపివేశారు. వంతెన కూలే ప్రమాదం ఉండడంతో బోథ్ నుంచి నిగిని వరకు చేపడుతున్న రోడ్డు పనుల కాంట్రాక్టర్ తమ టిప్పర్లు వెళ్లడానికి వాగు మీదుగా తాత్కాలికంగా రోడ్డు నిర్మించారు. ఇదంతా అధికారులు, ప్రజాప్రతినిధులకు తెలిసినా వంతెన నిర్మాణంపై జాప్యం చేస్తున్నారు. ఇటీవల బ్రిడ్జి నిర్మాణం త్వరగా చేపట్టాలని ఎంపీపీ తుల శ్రీనివాస్ జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్‌కు విన్నవించారు. అయినా బ్రిడ్జి నిర్మాణంలో ఎలాంటి కదలిక లేదు. మరో పదిహేను రోజుల్లో వర్షాకాలంలో వస్తుంది. వర్షం పడితే వంతెన పూర్తిగా కూలుతుందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తాత్కాలిక రోడ్డు కూడా వరదకు కొట్టుకుపోయే ప్రమాదం ఉంది. ఇదే జరిగితే 20 గ్రామాలకు రాకపోకలు పూర్తిగా నిలిచిపోయే అవకాశం ఉంది. గర్భిణులను తమ గ్రామాల్లో కాకుండా మండల కేంద్రంలో లేదా ఇతర ప్రాంతాల్లోని బంధువుల ఇళ్లల్లో ఉంచుతున్నారు. మరోవైపు బోథ్ మండల కేంద్రం నుంచి రైతులు తమ చేలల్లోకి వెళ్లే పరిస్థితి ఉండదు.

ప్రాణాలు పణంగా పెట్టి దాటుతున్నాం



నక్కలవాడ వద్ద కరత్వాడ ప్రాజెక్టు బ్యాక్ వాటర్ వంతెనపై నుంచి ప్రవహించడంతో వంతెనను దాటలేని పరిస్థితి నెలకొంది. అత్యవసర పరిస్థితుల్లో వాగును ప్రాణాలను పణంగా పెట్టి దాటాల్సిన పరిస్థితి నెలకొంది. మా గ్రామాలకు హైలెవల్ వంతెన నిర్మించాలి.

– కొడప విజయ్ కుమార్, సర్పంచ్, నక్కలవాడ

వంతెన నిర్మాణం చేపట్టాలి



బోథ్ వద్ద గల కంద్ర వాగు వంతెన నిర్మాణం చేపట్టాలి. ఇప్పటికే సగం కూలిపోయింది. పూర్తిగా కూలే అవకాశం ఉంది. ఇదే జరిగితే బోథ్‌కు దాదాపు 20 గ్రామాల ప్రజలు వచ్చే అవకాశం లేదు. అత్యవసర పరిస్థితుల్లో ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం.

– లదేవార్ సంజీవ్, మర్లపెల్లి

వర్షాకాలంలో ఇబ్బందులు తప్పవు..

మండలంలోని నక్కలవాడ గ్రామానికి వెళ్లే వంతెన ప్రమాదకరంగా మారింది. నక్కల వాడతో పాటు ఆదివాసీ గ్రామాలైన లక్ష్మీపూర్, కొత్తపల్లె, రేండ్లపల్లె గ్రామాలు ఉంటాయి. గ్రామాలకు వెళ్లేందుకు గతంలో లో లెవల్ వంతెన నిర్మించారు. భారీ వర్షాలకు కరత్వాడ ప్రాజెక్టు పూర్తిగా నిండిపోతుండటంతో బ్యాక్ వాటర్ వంతెనపై నుంచి ప్రవహిస్తోంది. దీంతో ఆయా గ్రామాలకు పూర్తిగా రాకపోకలు నిలిచిపోతున్నాయి.

ధన్నూర్ వాగు ఉధృతి..

మండలంలోని రెవెన్యూ గ్రామమైన ధన్నూర్(బి) గ్రామ సరిహద్దులో వాగుపై ఉన్న వంతెన కూడా లోలెవల్ వంతెన కావడంతో వర్షం పడిన ప్రతిసారి వాగు వంతెనపై ప్రవహిస్తోంది. దీంతో గ్రామస్తులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. ధన్నూర్‌తో పాటు నాగాపూర్ గ్రామాలకు రాకపోకలు నిలిచిపోతాయి. మండల కేంద్రానికి, చేనుల్లోకి వెళ్లిన వారు వంతెనపై నుంచి ప్రవహించే వాగును దాటలేకపోతున్నారు. ఇవే కాకుండా కనుగుట్ట, కోట గ్రామాలకు వెళ్లే లో లెవల్ వంతెనలు కూడా ఉధృతంగా ప్రవహించడంతో గ్రామస్తులు ఇబ్బంది ఎదుర్కొంటున్నారు. వీటి స్థానంలో ఎతైన వంతెనలు నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు.

అటెన్షన్ ప్లీజ్.. అద్దె భవనంలో ఇంకెన్నాళ్లు..



బజార్‌హత్నూర్: మండలంలో ఎస్సీ విద్యార్థులకు వసతితో కూడిన విద్య అందించేందుకు మండల కేంద్రంలో ఎస్సీ వసతి గృహం 37 సంవత్సరాల క్రితం రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసింది. కానీ ఇప్పటి వరకు ప్రభుత్వ భవనం లేక విద్యార్థులు కనీస వసతులు లేని, శిథిలావస్థలో ఉన్న ఒక ప్రైవేటు భవనంలో ఉండాల్సిన పరిస్థితి ఉంది. సంబంధిత అధికారులు స్పందించి కొత్త భవనాన్ని ఏర్పాటు చేయాలి.

– సంబంధిత అధికారి: సునీత, డీడీ ఎస్సీ వెల్ఫేర్, ఆదిలాబాద్, ఫోన్: 94406 13030

వేసవి దుక్కులతో అధిక దిగుబడులు

సాక్షి ఎఫెక్ట్..



మట్టి నమూనాలు సేకరిస్తున్న వ్యవసాయాధికారులు

నేరడిగొండ: వేసవి దుక్కులతో రైతులు అధిక దిగుబడులు సాధించవచ్చని బోథ్ ఏడీఏ శ్రీధర్ స్వామి అన్నారు. ఈనెల 8న 'సాక్షి' దినపత్రికలో 'భూసార పరీక్షలేవి?' అనే శీర్షికన ప్రచురితమైన కథనానికి స్పందించారు. బుధవారం మండలంలోని తేజాపూర్‌లో పర్యటించి రైతులకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఆయన మాట్లాడుతూ.. లోతైన వేసవి దుక్కులతో భూసారం పెరుగుతుందన్నారు. అలాగే వ్యవసాయ భూములకు భూసార పరీక్షలు చేసుకోవాలని సూచించారు. రైతు పంట పొలంలోని మట్టి నమూనాలను సేకరించడం జరుగుతుందన్నారు. మట్టి నమూనాల సేకరణలో పాటించాల్సిన పద్ధతులు, తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. మండల వ్యవసాయాధికారి బిర్రు భాస్కర్, ఏఈవో స్వర్ణలత, రైతులు జగదీశ్వర్‌రెడ్డి, గంగారెడ్డి, లింగారెడ్డి పాల్గొన్నారు.

'గెలుపు కోసం పనిచేద్దాం'



ప్రతిజ్ఞ చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

బేల: రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ గెలుపు కోసం కార్యకర్తలు, నాయకులు సమన్వయంతో పనిచేద్దామని కాంగ్రెస్ జిల్లా నాయకులు కంది శ్రీనివాస్ రెడ్డి పిలుపునిచ్చారు. బుధవారం మండల కేంద్రంలోని మాజీ జెడ్పీటీసీ వై. రాజారెడ్డి ఇంటి ప్రాంగణంలో కాంగ్రెస్ ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలను, వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు ఫైజుల్లాఖాన్, బ్లాక్ అధ్యక్షుడు గుండవార్ సంజయ్, వాంఖడే వామన్, ఎండీ అఖిల్, మడావి చంద్రకాంత్, శంకర్, అవినాష్, తదితరులు పాల్గొన్నారు.

మొక్కజొన్న కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయాలి



మాట్లాడుతున్న సంగెపు బొర్రన్న

బోథ్: బోథ్ మండలంలో అత్యధికంగా మొక్కజొన్నను పండించే కనుగుట్ట గ్రామంలో మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని రైతుస్వరాజ్య వేదిక జిల్లా అధ్యక్షుడు సంగెపు బొర్రన్న, రైతులు డిమాండ్ చేశారు. బుధవారం కనుగుట్ట గ్రామంలోని మొక్కజొన్న నిల్వ కేంద్రం వద్ద మాట్లాడుతూ.. మార్క్‌ఫెడ్ అధికారులు గతంలో కనుగుట్ట, బోథ్, కిష్టాపూర్ శివారుల్లో మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తామని చెప్పినా.. ఇప్పటి వరకు ఏర్పాటు చేయలేదని అన్నారు. ఈమేరకు అడిషనల్ కలెక్టర్‌కు లేఖ రాశారు. రైతులు బోథ్‌కు మొక్కజొన్న పంటను తీసుకురావాలంటే ఎక్కువ మొత్తంలో ఖర్చు అవుతుందన్నారు. వెంటనే కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో రైతులు స్వామి, వెంకట రమణ, రాజు, ప్రశాంత్, రైతులు పాల్గొన్నారు.

సన్న బియ్యం అందించాలి

ఆదిలాబాద్‌రూరల్: రేషన్ షాపుల ద్వారా ప్రజలకు నిత్యావసర సరుకులు, పది కిలోల సన్న బియ్యం ఉచితంగా పంపిణీ చేయాలని ప్రగతిశీల యువజన సంఘం నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం మండలంలోని వివిధ గ్రామాల్లో రేషన్ షాపుల వద్ద పోస్టర్ అతికించారు. రాష్ట్ర నాయకుడు ఆత్రం వినోద్ కుమార్ మాట్లాడుతూ.. కార్పొరేట్లకు రాయితీలు ఇస్తూ.. ప్రజలపై పన్నుల భారం మోపుతున్నారని ఆరోపించారు. అర్హులందరికీ కొత్తరేషన్ కార్డులు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు సిడాం సాయికుమార్, కుమ్ర విలాస్, పెందోర్ శివకుమార్, రాజు పాల్గొన్నారు.

కంటివెలుగు సద్వినియోగం చేసుకోవాలి

ఆదిలాబాద్‌టౌన్: కంటివెలుగు కార్యక్రమాన్ని పట్టణ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ శైలజ అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిర్వహిస్తున్న కంటి వెలుగు శిబిరాన్ని సందర్శించారు. వైద్యారోగ్య శాఖ ద్వారా ఒక్కో వార్డుకు ఒక్కో సెంటర్ తరపున 49 వార్డుల్లో ఏర్పాటు చేయడం జరిగిందన్నారు.

పారిశుధ్యంపై దృష్టి సారించండి



పారిశుధ్య పనులు పరిశీలిస్తున్న ఎంపీవో స్వప్నశీల

నార్నూర్: గ్రామాల్లో పారిశుధ్యంపై దృష్టి సారించాలని ఎంపీవో స్వప్నశీల అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని విజయ్‌నగర్ కాలనీలో డ్రెయినేజీలను శుభ్రం చేయించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఎండలు అధికంగా ఉన్నందున నీటి సమస్య తలెత్తకుండా చూడాలన్నారు. ఇంట్లో కూలర్ నీటిని ఎప్పటికప్పుడు మార్చుతూ ఉండాలని సూచించారు. ఆమె వెంట కొర్రెళ్ల మహేందర్, తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో పారిశుధ్య కార్యక్రమాలు

నేరడిగొండ: మండలంలోని 32 గ్రామ పంచాయతీల్లో పారిశుధ్య పనులు చేపట్టడం జరుగుతుందని పంచాయతీ కార్యదర్శి నర్సారెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని వడూర్‌లో డ్రెయినేజీలను శుభ్రం చేయించారు. ప్రతిఒక్కరూ తమ ఇంటితో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు.

ముగిసిన సీఎం కప్ పోటీలు



ఇచ్చోడ: బహుమతులు అందజేస్తున్న ఎంపీపీ



బోథ్: ప్రశంసా పత్రాలు అందజేస్తున్న ఎంపీపీ



బేలలో..

నేరడిగొండ: యువత క్రీడల్లో రాణించాలని జెడ్పీటీసీ అనిల్ జాదవ్, ఎంపీపీ రాథోడ్ సజన్‌లు అన్నారు. మండల కేంద్రంలోని జిల్లా సెకండరీ పాఠశాలలో సీఎం కప్ పోటీలు బుధవారం ముగిశాయి. విజేతలకు బహుమతులతో పాటు ప్రశంసా పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో అబ్దుల్ సమద్, మండల ప్రత్యేకాధికారి రవిశంకర్, ఎంఈవో భూమారెడ్డి, పీఈటీ యశ్వంత్ నాయక్, క్రీడాకారులు పాల్గొన్నారు.

నార్నూర్: గెలుపు ఓటములను సమానంగా స్వీకరించాలని ఎంపీపీ కనక మోతుబాయి అన్నారు. బుధవారం మండలంలోని ఏకలవ్య గురుకుల కళాశాల మైదానంలో గత మూడు రోజులుగా నిర్వహిస్తున్న సీఎం కప్ పోటీల విజేతలకు సర్టిఫికెట్లు, బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ బానోత్ గజానంద్‌నాయక్, పీఏసీఎస్ చైర్మన్ అడే సురేశ్, తహసీల్దార్ ఆర్కా మోతిరాం, ఎంపీడీవో రమేశ్, ఎంపల్లి సర్పంచ్ రాథోడ్ గోవింద్‌నాయక్ పాల్గొన్నారు.

బోథ్: మండల కేంద్రంలోని సోషల్ వెల్ఫేర్ బాలికల పాఠశాలలో జరిగిన సీఎం కప్ క్రీడా పోటీలు ముగిశాయి. గెలుపొందిన క్రీడాకారులకు ఎంపీపీ తుల శ్రీనివాస్ ప్రశంసా పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో ఎస్సై రవీందర్, సర్పంచ్ సురేందర్, పిప్పల్‌ధరి సర్పంచ్ శ్రీధర్ రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ కదం ప్రశాంత్, ఎంపీడీవో లక్ష్మణ్, ఎంపీవో జీవన్‌రెడ్డి పాల్గొన్నారు.

ఇచ్చోడ: గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహించేందుకే సీఎం కప్ క్రీడలు నిర్వహించినట్లు ఎంపీపీ నిమ్మల ప్రీతంరెడ్డి అన్నారు. గెలుపొందిన క్రీడాకారులకు బహుమతులు ప్రదానం చేశారు. కబడ్డీ, వాలీబాల్ మండల టీంలను ఎంపిక చేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ కదం సుభద్ర, తహసీల్దార్ రాథోడ్ మోహన్‌సింగ్, ఎంపీడీవో రాంప్రసాద్, ఎంపీవో రమేశ్, పంచాయతీ ఈవో సూర్యప్రకాశ్, పీఈటీలు రమేశ్, మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

బజార్‌హత్నూర్: మండలంలోని జాతర్ల గ్రామంలో మూడు రోజులుగా నిర్వహిస్తున్న సీఎం కప్ పోటీలు బుధవారం అట్టహాసంగా ముగిశాయి. ఎంపీపీ అజాడే జయశ్రీ, జెడ్పీటీసీ మల్లేపూల నర్సయ్య పాల్గొని విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి శ్రీనివాస్ రెడ్డి, ఎంపీడీవో చౌహాన్ రాధ, ఎంపీవో మహేందర్ రెడ్డి, వైస్ ఎంపీపీ పోరెడ్డి శ్రీనివాస్, సర్పంచ్ లక్ష్మీ నాగోరావ్, పెందుర్ ఈశ్వర్, సోన్‌టాకే గజానంద్, సుజాత, ప్రకాష్ పాల్గొన్నారు.

బేల: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో రెండు రోజులుగా నిర్వహించిన సీఎం కప్ పోటీల విజేతలకు జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రావుత్ మనోహర్ బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో మహేందర్‌కుమార్, డిప్యూటీ తహసీల్దార్ వామన్, సర్పంచ్ వట్టిపెల్లి ఇంద్రశేఖర్, ఠాక్రే గంభీర్, మెస్రం జనార్దన్, తదితరులు పాల్గొన్నారు.

జైనథ్: మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో మూడు రోజులుగా కొనసాగుతున్న మండల స్థాయి పోటీలు బుధవారంతో ముగిశాయి. ఎంపీపీ మార్శెట్టి గోవర్ధన్ హాజరై మాట్లాడారు. గెలుపొందిన క్రీడాకారులకు బహుమతులు, ప్రశంసా పత్రాలు అందజేశారు. ఎంపీడీవో గజానన్ రావ్, తుమ్మల వెంకట్ రెడ్డి, దుమాల దేవన్న, నోముల సంతోశ్, కొడిచర్ల సుదర్శన్, తదితరులు పాల్గొన్నారు.

తాంసి: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న సీఎం కప్ క్రీడా పోటీలు బుధవారం ముగిశాయి. గెలుపొందిన జట్లకు కప్‌తో పాటు ప్రశంసాపత్రాలను తాంసి జెడ్పీటీసీ రాజు అందజేశారు. కార్యక్రమంలో భీంపూర్ జెడ్పీటీసీ సుధాకర్, ఎంపీడీవో భూమయ్య, తహసీల్దార్ శ్రీదేవి, సదానంద్, రత్నప్రకాష్, గజానన్, శంకర్, పాల్గొన్నారు.

- భీంపూర్ మండలంలోని అందర్‌బంద్ ఆశ్రమ పాఠశాలలో నిర్వహించిన పోటీల్లో గెలుపొందిన జట్లకు బహుమతులు అందజేశారు. అనంతరం జిల్లాస్థాయి పోటీలకు జట్లను ఎంపిక చేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీనివాస్, తహసీల్దార్ మహేంద్రనాథ్, ఎంపీవో వినోద్, శంకర్, గంగారం, సంతోశ్ పాల్గొన్నారు.

కొనసాగుతున్న వీవోఏల సమ్మె



మద్దతు తెలుపుతున్న దళిత సంఘాల నాయకులు

ఇంద్రవెల్లి: సమస్యలు పరిష్కరించాలనే డిమాండ్‌తో ఐకేపీ వీవోఏలు చేపట్టిన నిరవధిక సమ్మె 31వ రోజుకు చేరింది. బుధవారం వీవోఏల సమ్మెకు మండలంలోని దళిత సంఘాల నాయకులు చత్రుఘన్ జీవనే, సోమోరే నాగోరావ్, సాంభలు మద్దతు తెలిపారు. వీవోఏలను సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించి నెలకు రూ. 26 వేలు వేతనం చెల్లించాలని కోరారు. కార్యక్రమంలో వీవోఏల సంఘం మండల అధ్యక్షుడు షేక్ ఫెరోజ్, వీవోఏలు కోట్నాక్ భారిక్‌రావ్, జైపాల్, రాందాస్ పాల్గొన్నారు.

తాంసి: భీంపూర్ మండల కేంద్రంలో బుధవారం వీవోఏలు వినూత్నంగా నిరసన తెలిపారు. బుధవారం సమ్మె చేపట్టిన స్థలంలో వంటవార్పు నిర్వహించారు. వీవోఏల మండల అధ్యక్షుడు అరుణ్ మాట్లాడుతూ.. గత కొన్ని రోజులుగా సమ్మె చేస్తున్నా.. ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. వీవోఏలు పుర్క దాంజీ, పుష్పలత, సువర్ణ, తదితరులు పాల్గొన్నారు.

భూమిపూజ కార్యక్రమానికి తరలిరండి



పోస్టర్ ఆవిష్కరిస్తున్న సభ్యులు

ఆదిలాబాద్‌రూరల్: జిల్లా కేంద్రంలో ఈనెల 29న జరిగే సంఘ భవనం నిర్మాణ భూమిపూజకు అధిక సంఖ్యలో తరలిరావాలని మాదిగ సంఘం నాయకులు కోరారు. బుధవారం జైనథ్, ఆదిలాబాద్ రూరల్, బేల, తలమడుగు, బోథ్ మండలాల్లో ప్రచారం నిర్వహించారు. అనంతరం భూమిపూజ పోస్టర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో అజయ్, నలగంటి నవీన్, ఈర్ల దయాకర్, నెమలికొండ దయాకర్, సాగర్, ఏవన్, వసంత్, తదితరులు పాల్గొన్నారు.

తలమడుగు: ఆదిలాబాద్ జిల్లా మాదిగ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఈనెల 29న నిర్వహించనున్న మాదిగ సంక్షేమ సంఘం భవన భూమిపూజ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని నాయకులు కోరారు. బుధవారం మండల కేంద్రంలో వాల్‌పోస్టర్ ఆవిష్కరించారు. జిల్లా కమిటీ సభ్యులు మాట్లాడుతూ.. జిల్లా మాదిగల చిరకాల స్వప్నం మాదిగ సంక్షేమ సంఘం భూమిపూజ కార్యక్రమానికి పెద్ద ఎత్తున తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు మల్యాల మనోజ్, బిక్కి గంగాధర్, మండల అధ్యక్షుడు ప్రేమేందర్, జువ్వాకా నర్సింగ్, సుద్దాల శివకుమార్, ప్రసాద్, గోపి, సంతోశ్, ప్రశాంత్, స్వామి, ఆశన్న, గంగన్న, తదితరులు పాల్గొన్నారు.

యూత్ డిక్లరేషన్ ఇంటింటికీ తీసుకెళ్తాం



మాట్లాడుతున్న గండ్రత్ సుజాత

ఆదిలాబాద్‌టౌన్: బీఆర్ఎస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను విస్మరించిందని, వాటిని ప్రజల్లోకి తీసుకెళ్తామని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి గండ్రత్ సుజాత అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని ఆమె నివాసంలో మాట్లాడారు. ఇటీవల హైదరాబాద్‌లో జరిగిన సభలో ప్రియాంక గాంధీ ప్రకటించిన యూత్ డిక్లరేషన్‌ను ఇంటింటికీ తీసుకెళ్తామన్నారు. ఈనెల 22 నుంచి కార్యక్రమాన్ని చేపడతామని తెలిపారు. సమావేశంలో నాయకులు ప్రభాకర్, మున్న, గంగన్న, రాజేశ్వర్, వినోద్, మధుకర్, రూపేష్ రెడ్డి, అశోక్, విఠల్, దివాకర్, కృష్ణ పాల్గొన్నారు.